

అనుదినం జనపక్షం

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రిభువనగిరి

1

గురువారం 23 మార్చి 2023

చెర్వుగట్టులో ఉగాది వేడుకలు

● శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి సన్నిధిలో పంచాంగం

నవతెలంగాణ-నార్కట్‌పల్లి



మండల పరిధిలోని చెరువుగట్టులో ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రీ శోబాకృత్ నామ సంవత్సర పురస్కరించుకొని బుధవారం శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామి సన్నిధిలో ఆలయ ప్రధాన అర్చకులు పోతులపాటి రామలింగేశ్వర శర్మ అర్చకులు రాంబాబు శర్మ పంచాంగ శ్రవణం చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామ సర్పంచ్ మల్గా బాలకృష్ణ, గ్రామ పుర ప్రముఖులు పాల్గొన్నారు.

నేడు 18 గ్రామపంచాయతీలకు అవార్డుల ప్రదానం

నవతెలంగాణ-నార్కట్‌పల్లి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను అమలు చేస్తూ...ప్రజలకు కనీస సౌకర్యాలను అందుబాటులో ఉంచిన గ్రామ పంచాయతీలకు అవార్డులు ప్రధానం చేయనున్నట్లు ఎంపీడీవో గుండగోని యాదగిరిగౌడ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒక్కొక్క విభాగంలో ప్రత్యేకంగా గుర్తించి మండల స్థాయిలో 18 గ్రామ పంచాయతీలకు ప్రధమ, ద్వితీయ, తృతీయ అవార్డులు సన్మానాలు చేయనున్నట్లు చెప్పారు. నేడు మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల పరిషత్ అధ్యక్షులు సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశంలో ముఖ్య అతిథులుగా జిల్లా పరిషత్ చైర్మెన్ బండ నరేందర్‌రెడ్డి, నకిరేకల్ శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్య చేతుల మీదుగా అవార్డులు, సన్మానాలు చేయనున్నట్లు పేర్కొన్నారు.

కనిపించిన నెలవంక

● నేటి నుంచి రంజాన్ ఉపవాస దీక్షలు




నవతెలంగాణ-నల్లగొండ

బుధవారం రాత్రి నెలవంక కనబడడంతో గురువారం నుండి రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభమవుతున్నాయి. పండుగ వెనుక పరమార్థం ఉంటుంది. చెడుపై మంచి సాధించిన విజయాలను గుర్తుచేసుకోవడం, చరిత్ర గతి మార్చిన వీరులను స్మరించుకోవడం పర్వదినాల్లో సర్వసామాన్య అంశం. వీటితో పాటు మనిషికి క్రమశిక్షణ నేర్పి, ధర్మాన్ని, దయాగుణాన్ని ప్రబోధించే పండగలు కూడా ఉన్నాయి. వాటిలో రంజాన్ ఒకటి. ముస్లింలకు అతి పెద్ద పండగ ఇది. ఇస్లాం ధర్మానికి మూలమైన ఖురాన్ రంజాన్ నెలలో అవతరించింది. ఈ పండుగ వెనక మానసిక, శారీరక వికాసం వంటి మరెన్నో ఎన్నో విశేషాలు కూడా ఉన్నాయి. నెలవంక దర్శనంతో మొదలై, మళ్లీ నెలవంక దర్శనంతోనే ముగిసే ఈ పర్వదినం గురించి తెలుసుకుందామా మరి.

ఉపవాసం...

రంజాన్ మాసంలో ఉపవాసం అత్యంత ప్రధానమైంది. చాంద్రమానాన్ని పాటించే ఇస్లాం కేలండర్ తొమ్మిదో నెల రంజాన్. తమ పవిత్ర గ్రంథం ఖురాన్ ఈ నెలలోనే పుట్టిందని వారి విశ్వాసం. అందుకే ఈ నెలంతా పవిత్రమని భావిస్తారు. నెలవంక దర్శనంతో రంజాన్ మొదలవుతుంది. ఖురాన్ బోధన ప్రకారం నెలంతా 'రోజా' పేరుతో ఉపవాసం చేస్తారు. పార్సీ భాషలో ' రోజా' అంటే ఉపవాసం అని అర్థం. ఎంతో నిష్ఠతో దీన్ని పాటిస్తారు. రోజూ ఐదుపూటల నమాజ్‌తోపాటు 13 గంటలు ఉపవాసం ఉంటారు. వేకువజామున భోంచేసి (సహర్) సూర్యాస్తమయం తర్వాత దీక్ష విరమిస్తారు. సాయంత్రం తినే ఆహారాన్ని 'ఇఫ్తార్' అంటారు. నిత్యం దైవచింతనతో గడుపుతారు. చెడు తలంపులకు మనసులోకి అస్సలు రానివ్వరు.



రోజాలో ఉన్నప్పుడు అబద్దాలు ఆడకూదని, మనోవికారాలకు దూరంగా ఉండాలని పెద్దలు చెబుతారు. అయితే పిల్లలు, వృద్ధులు, రోగులకు రోజా తప్పనిసరి కాదు. ప్రయాణాల్లో ఉన్నవారు కూడా రోజాను వాయిదా వేసుకోవచ్చు. రంజాన్ నెలలో 27వ రోజును షబ్-ఎ-ఖద్ర్ అని పిలుస్తారు. ఖురాన్ ఆ రోజే పుట్టిందని, రాత్రంతా జాగారం చేస్తారు. దాని వల్ల పాపాలు పోతాయని భావిస్తారు.

పేదలకు దానధర్మాలు...

రంజాన్ మాసంలో ముస్లింలు పేదసాదలకు దానధర్మాలు చేయడాన్ని విధిగా భావిస్తారు. దీన్ని జకాత్ అంటారు. పేదలకు ఒక పూట భోజనం అందిస్తే దేవుడు తమకు వెయ్యిపూటల భోజనాన్ని సమకూరుస్తారని వారి నమ్మకం. మసీదుల వద్ద చేరే నిర్భాగ్యులకు, వికలాంగులకు అందరూ తమకు తోచిన డబ్బులు, ఆహార పదార్థాలను వితరణ చేస్తారు. ప్రతి ధనికుడు ఏడాది చివర్లో తనకు మిగిలిన సంపద నుంచి రెండున్నర శాతాన్ని దానం చేయాలి. పండగను కేవలం కలిగిన వాళ్లే కాకుండా పేదసాదలు కూడా జరుపుకోడానికి ఇది వీలు కల్పిస్తుంది. నెల ముగింపులో నెలవంక దర్శనం చేసుకుని ఉపవాసాన్ని ముగిస్తారు. ఆ మరుసటి దినాన్ని రంజాన్ గా జరుపుకుంటారు. దీనికే ఈదుల్?ఫితర్ అని మరోపేరు. కొత్తబట్టలు ధరించి, మసీదులకు వెళ్లి ప్రార్థన చేస్తారు. ఈద్ ముబారక్ అంటూ ఆలింగనం చేసుకుంటారు. సేమ్యా ఖీర్, బిర్యానీ వంటి పిండివంటలతో, రుచికర మాంసాహారాలతో ఇఫ్తార్ విందు చేసుకుంటారు.



రంజాన్ మాసంలో నోరూరిస్తున్న మసాలా రుచులు...

భగభగమండే భట్టీలు.. గరం గరం హలీమ్.. నోరూరించే చికెన్ కబాబ్.. తియ్యని ఖీర్, 'ఖుర్బానీ కా మీట్' రుచులు. రంజాన్ మాసం వచ్చిందంటే.. విభిన్న వంటకాలు పట్టణాలలో దర్శనమిస్తాయి. మసాలా వాసనలు గుమ్మని వెదజల్లుతూ.. రోడ్డుపై వెళ్తున్న భోజనప్రియుల్ని ఆకర్షిస్తాయి. రంజాన్ మాసం వచ్చిందంటే చాలు ముస్లింల ఉపవాసదీక్షలు, ప్రత్యేక ప్రార్థనలతోపాటు సంప్రదాయ వంటకం హలీమ్ గుర్తుకొస్తుంది. రోడ్డు పక్కనే ఉన్న రెస్టారెంట్లలో విభిన్న రకాల మసాలా రుచులు దర్శనమిస్తాయి. ఒకప్పుడు కేవలం భాగ్యనగరానికే పరిమితమైన హలీమ్... ఇప్పుడు ప్రధాన ప్రాంతాలకు విస్తరించింది. రంజాన్ రుచులు నగరవాసుల మనసు దోచుకుంటున్నాయి. చికెన్ కబాబ్, పాయా రోటీ, డబుల్ కా మీఠా, ఖుర్బానీ కా మీఠా, ధమ్ కీ బిర్యానీ, మలై కబాబ్, చికెన్ 65, ఖీర్, మటన్ బిర్యానీ లాంటి.. అనేక వెరైటీలు తయారు చేస్తారు.

అగ్రో డీలర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా రాజేంద్రప్రసాద్

నవతెలంగాణ-మిర్యాలగూడ



తెలంగాణ అగ్రో డీలర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా మిర్యాలగూడ పట్టణానికి చెందిన ప్రముఖ పారిశ్రామివేత్త వింజం రాజేంద్ర ప్రసాద్‌ని నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షులు, జాతీయ ఉపాధ్యక్షులు గౌరుశెట్టి మునేందర్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ తెలంగాణలోని అగ్రో డీలర్ల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. అగ్రో డీలర్లు ఐక్యంగా ఉండి సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. డీలర్ల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. ఆయన నియామకం పట్ల మిర్యాలగూడ పట్టణ ఫెటిలైజర్స్ అసోసియేషన్ నాయకులు, డీలర్లు ముక్కా రామ్మూర్తి, తెడ్ల జవహర్‌బాబు, అశోక్ రెడ్డి, గంగవరవు హరిబాబు, అల్లంపల్లి శ్రీనివాస్, ముక్కా శ్రీనివాస్,



ఏచూరి శ్రీనివాస్‌లు హర్షం వ్యక్తం చేశారు.

చిలకయ్యకు నివాళులర్పించిన మంత్రి

నవతెలంగాణ-పెన్‌పహాడ్



మండలపరిధిలోని మహమ్మదాపురం గ్రామ సర్పంచ్ కొండేటి రజని మామ చిలకయ్య అనారోగ్యంతో ఇటీవలే మరణించారు. విషయం తెలుసుకున్న విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి గ్రామంలోని వారి గృహానికి బుధవారం వెళ్లి చిలకయ్య చిత్ర పటానికి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. మంత్రి వెంట ఎంపీపీ నెమ్మాది భిక్షం, పార్టీ జిల్లా నాయకులు అంజయ్య, మండల అధ్యక్షుడు దొంగరి యుంగందర్, పీఏసీఎస్ చైర్మెన్ నాతాల జానకిరాంరెడ్డి, చేన్ను శ్రీనివాసరెడ్డి, బైరెడ్డి శ్రీనివాసరెడ్డి, పోదిల నాగార్జున, వగ్గు గోపి, తదితరులు ఉన్నారు.

సత్యనారయణ మృతి యూటీఎఫ్‌కు తీరనిలోటు

● ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

నవతెలంగాణ-కోదాడరూరల్

టీఎస్‌యూటీఎఫ్ సీనియర్ సభ్యులు, ఉమ్మడి నల్లగొండ జిల్లా యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు ఈదర సత్యనారాయణ మృతి యూటీఎఫ్ సంఘానికి తీరని లోటని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలో మృతి చెందిన ఈదర సత్యనారాయణ మృత దేహాన్ని సందర్శించి నివాళు లర్పించారు. ఉపాధ్యాయుల సమస్యలపై జరిగిన పోరాటాల్లో ఈదర సత్యనారాయణ కృషి చిరస్మరణీయమన్నారు. ఈదర ఆశయాలను సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్.అనీల్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు పీ.శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు,



మాజీ అధ్యక్షులు ధనమూర్తి, మాజీ కార్యవర్గ సభ్యురాలు కేప.మంగా, సీనియర్ నాయకులు సనత్‌కుమార్, గడ్డం వెంకట్‌రెడ్డి, చుండూరు ప్రసాదరావు, సుబ్బారావు, హమీద్, వీరారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ ఫామ్ తోటల్లో కొమ్ము పురుగు

● దిగుబడికి ప్రతిబంధకంగా చీడపీడల బెడద ● ముందస్తు చర్యలు లేకపోతే తీవ్ర నష్టం

● జిల్లా ఉద్యానవన శాఖ అధికారిని సంగీతలక్ష్మి

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్

నూనె గింజల పంటల్లో అత్యధికంగా సాగయ్యే పంట ఆయిల్ ఫామ్. ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహంతో ప్రతి ఏడాది ఆయిల్ ఫామ్ తోటల విస్తీర్ణం పెరుగుతూ ఉంది. ఒకసారి నాటితే ఏండ్ల తరబడి దిగుబడిని ఇచ్చే ఈ పంట బహు సున్నితమైనది. ప్రభుత్వ ప్రోత్సాహంతో నల్లగొండ జిల్లాలోని పలు మండలాల్లో రైతులు తోటల పెంపకం చేస్తున్నారు. నల్లగొండ మండలం జీకే అన్నారం, కనగల్ మండలం చర్లగౌరారం ప్రాంతాలలో పంటల సాగు ఇప్పటికే కొనసాగుతుంది. ఇటీవల ఈ తోటలకు చీడపీడల బెడద ఎక్కువైంది. ముఖ్యంగా కొమ్ము పురుగు, ఎర్రముక్కుపురుగు, సంచిపురుగు లు, తెగుళ్లలో మోవుకుళ్ళు, కాండం, గెల్లకుల్లు తెగులు దిగుబడికి ప్రతిబంధకంగా మారుతున్నాయి. ప్రస్తుత ఈ తోటల్లో కొమ్ము పురుగు కలిగించే నష్టం ఎక్కువగా ఉంది. ఉద్యానవన శాఖ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించి రైతులకు సూచనలు చేస్తూ వారు నష్టపోకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ముందస్తు నివారణ చర్యలు తీసుకోనట్లయితే తోటలు మొత్తం దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉంది. కావలసిన ఎరువులను వేసి తోటల ను రక్షించుకోవాలి.



ఆయిల్ ఫామ్ తోటను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి(ఫైల్)

లక్షణాలు...

ఆకు చివర 'వీ' ఆకారపు ఖాళీలు ఏర్పడటం, ఆకు మొదల మీద శాశ్వత రందాలు ఏర్పడి రంధ్రాల నుండి నమిలిన పిప్పి బయటకు కనబడుతూ ఉంటుంది. మొవ్వు భాగంలోని ఆకులు ఈ పురుగు బారిన పడినప్పుడు ఆకులు కురచగా, విరిగినవిగా, మెలికల తిరిగి కనబడతాయి. ఈ విధమైన లక్షణాలు కనబడితే రైతులు వెంటనే కావలసిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.



పాటించాల్సిన జాగ్రత్తలు...

పశువుల ఎరువులు తోటల్లో వేసేముందు ఎరువు కుప్పలపై 200 గ్రాముల కార్బరిన్ (5 శాతం పొడిమందు) ను ఒక టన్ను పశువుల ఎరువులకు కానీ, ఒక కిలో గ్రామ్ మోటరైజియం ఎనిసోఫ్లియా పౌడర్ 10 ఐ 10X 10 అడుగుల పశువుల ఎరువుల కుప్పలకు కలిపిన అనంతరం చెట్ల పాదులలో వేయాలి. పులిసిన ఆముదపు గింజల పిండి లేదా చెక్క లేదా లింగాకర్షక ఎరల ద్వారా పెద్ద పురుగులను పట్టి నిర్మూలించవచ్చు.

మెటారైజియమ్ ఎనిసోఫియా అనే జీవశిలీంధ్రాన్ని పెంట కుప్పలలో, చనిపోయిన కొబ్బరి, ఆయిల్ పామ్, తాటి చెట్ల కాండము పైన, ఇతర వ్యర్థ పదార్థాలమీద చల్లడం ద్వారా కొమ్ము పురుగులను నిర్మూలించవచ్చు.రంధ్రాలు ఉన్న చిన్న పాలిథీన్ సంచిలో 20 గ్రాముల ఫోరేట్ గుళికలను వేసి మొవ్వులో పెట్టడం వలన కొమ్ము పురుగులు ఈ వాసనకు దూరంగా పోతాయి. ఈ సంచిని ప్రతినెల మందుతో సహా మార్చి మళ్ళీ మొవ్వులో పెట్టాలి. లేకపోతే కొత్త ఆకులు రావటం వలన క్రింద ఉండి పై ఆకులు నల్లకొమ్ము పురుగు బారిన పడే అవకాశం ఉంది. ఆయిల్ ఫామ్ తోటల రైతులు సూచించిన విధంగా జాగ్రత్తలు తీసుకొని ఆయిల్ ఫామ్ తోటలను రక్షించుకోవచ్చు.

వెంటనే తగు జాగ్రత్తలు తీసుకోవాలి

సంగీత లక్ష్మి (జిల్లా ఉద్యానవనశాఖ అధికారిని)

ఇటీవల కాలంలో ఆయిల్ ఫామ్ తోటలపై కొమ్ము పురుగు బెడద ఎక్కువైంది. రైతులు ముందస్తు నివారణ చర్యలు వెంటనే తీసుకోవాలి. లేదంటే తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉంది. అధికారులు కావలసిన సలహాలు సూచనలను అందజేస్తారు.



వైశ్య ఫెడరేషన్ పంచాంగాన్ని ఆవిష్కరించిన మంత్రి జగదీశ్‌రెడ్డి

నవతెలంగాణ-సూర్యాపేట

నూతన తెలుగు సంవత్సరాన్ని పురస్కరించుకొని చల్లా కన్స్ట్రక్షన్స్ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు చల్లా లక్ష్మీకాంత్ రూపొందించిన శోభాకృత్ నామ సంవత్సర పంచాంగాన్ని బుధవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో మంత్రి జగదీశ్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రికి శుభాకాంక్షలు తెలిపి ఘనంగా శాలువాతో సన్మానించారు.సీతారామచంద్రస్వామి వారి జ్ఞాపికను బహూకరించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మెన్ పుట్టకిశోర్, బీఆర్ఎస్ పట్టణఅధ్యక్షులు సవరాల సత్యనారాయణ, జిల్లా నాయకులు ఉప్పలఆనంద్, మంత్రి వ్యక్తిగత కార్యదర్శి తోటరమేష్, నాయకులు రాచకొండ శ్రీనివాస్, చల్లా లక్ష్మీప్రసాద్, కలకోట లక్ష్మయ్య, గుండా శ్రీధర్, తేరట్‌పల్లి సతీష్ తదితరులు పాల్గొన్నారు.



శోభకృత్ నామ ఉగాది వేడుకలు

నవతెలంగాణ-పెన్‌పహాడ్

మండలకేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో శోభకృత్ నామ ఉగాది వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిఒక్కరు ఉదయాన్నే లేచి తలస్నానం ఆచరించి చేరువలో ఉన్న ఆలయాలకు వెళ్లి పూజలు నిర్వహించారు. అనంతరం లింగాల గ్రామములో పురోహితులు సత్యనారాయణ శర్మ, చీదేళ్లలో భాస్కర శర్మ పంచాంగ శ్రావణం చేశారు. షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడి చేసుకొని కుటుంబ సమేతంగా సేవించారు. ఈ సందర్భంగా మండల ప్రజలకు ఎంపీపీ నెమ్మాది భిక్షం, జడ్పీటీసీ మామిడి అనిత అంజయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దొంగరి యుగేందర్, సీపీఐ(ఎం) మండల అధ్యక్షుడు రణపంగ కృష్ణ, బీజేపీ మండల అధ్యక్షుడు పోకల రాములు తదితరులు ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు.



విద్యుద్ఘాతంతో రైతు మృతి

నవతెలంగాణ-మిర్యాలగూడ

విద్యుద్ఘాతంతో రైతు మృతి చెందిన సంఘటన బుధవారం మిర్యాలగూడ మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం త్రిపురారం మండలం బేజికల్ గ్రామానికి చెందిన గుడిపాటి లింగయ్య బుధవారం వ్యవసాయ పనులు చేసుకుంటూ మండలంలోని తుంగపాడు గ్రామ పంచాయితీ పరిధిలోని రామన్నపేట గ్రామ పరిధిలో ఉన్న వ్యవసాయ విద్యుత్ మోటర్ స్విచ్ ఆఫ్ చేసేందుకు వెళ్లగా ప్రమాదవశాత్తు కరెంట్ షాక్కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు సంఘటన స్థలాన్ని రూరల్ ఎస్ఐ నరసింహులు సందర్శించి వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

నవతెలంగాణ-యాదగిరిగుట్టరూరల్

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడిన ఘటన బుధవారం తాళ్లగూడెం స్టేజ్ వద్ద జరిగింది. స్థానిక ఎస్సై రామకృష్ణారెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబ్‌బాద్ జిల్లా అజ్మీర తండాకు చెందిన అజ్మీర వెంకన్న గత కొంతకాలం కింద బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వెళ్లారు. తమ సొంత గ్రామంలో గ్రామ దేవతల పండుగ ఉన్నందున ఉదయం వెంకన్న భార్య కళను ఊరికి వెళ్లడానికి హైదరాబాద్‌లో బస్సు ఎక్కించారు. దీంతో తండ్రి కొడుకులు కలిసి ద్విచక్ర వాహనంపై హైదరాబాద్ నుండి వస్తుండగా మండలంలోని తాళ్లగూడెం స్టేజ్ వద్ద బైక్ అదుపుతప్పి డివైడర్ పక్కనే ఉన్న కల్వర్టుకు బలంగా ఢీకొంది. దీంతో అజ్మీర సేమ్యా నాయక్(22) అక్కడికక్కడే మృతి చెందగా తండ్రి వెంకన్న(48) తీవ్రంగా గాయపడ్డారు. దీంతో చికిత్స నిమిత్తం హుటాహుటిన స్థానిక ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో వరంగల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుని తల్లి కళ ఫిర్యాదు మేరకు సీఐ సైదయ్య పర్యవేక్షణలో ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ అరెస్టులతో ప్రజాస్వామ్యం కనుమరుగు

● సామాజిక ఉద్యమకారుడు కొల్లు వెంకటేశ్వరరావు

నవతెలంగాణ-కోదాడరూరల్

అక్రమ అరెస్టులతో, నిర్బంధాలతో తెలంగాణాలో ప్రజాస్వామ్యం కనుమరుగవుతుందని సామాజిక ఉద్యమకారుడు కొల్లు వెంకటేశ్వరరావు బుధవారం ఓ ప్రకటనలో విమర్శించారు. ప్రజాస్వామ్య విలువలతో ఎమ్మెల్సీగా పోటీ చేసి ద్వితీయ స్థానం పొందిన జర్నలిస్ట్ చింతపండు నవీన్ కుమార్ అలియాస్ తీన్మార్ మల్లన్న ఆచూకీపై నిన్నటి నుండి పోలీసుల వాదన విడ్డురంగా ఉందని తెలిపారు. తీన్మార్ మల్లన్న నిబంధనలకు విరుద్ధంగా తప్పు చేసి ఉంటే బహిరంగంగా కేసు నమోదు చేసి న్యాయస్థానం ముందు నిలపొచ్చని, అక్రమ నిర్బంధాలతో పోలీసులు దాగుడు మూతలు ఆడాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమాలు నిర్వహించిన కేసీఆర్, ఇవ్వాళ ఉద్యమాల పేరు వింటేనే వణికి పోతూ పోలీస్ బలగాలతో అణచివేయడం సిగ్గు చేటని పేర్కొన్నారు. తక్షణమే తీన్మార్ మల్లన్న ఆచూకీ బయట పెట్టాలని, అక్రమ కేసులన్నింటిని ఉపసంహారించుకోవాలని కేసీఆర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలు నియంతగా మారిన కేసీఆర్‌కు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని తెలిపారు.

రైతు కుటుంబాలను ఆదుకోవాలని సీఎంకు లేఖ

నవతెలంగాణ-మిర్యాలగూడ



ఇటీవల కురిసిన వడగండ్ల వానతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పలుచోట్ల పంట నష్టం వాటిల్లిందని ముఖ్యమంత్రి కేసీఆర్ జోక్యం చేసుకొని రైతు కుటుంబాలను ఆదుకోవాలని సీఎంకు లేఖ రాసినట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ తెలిపారు. బుధవారం స్థానికంగా ఆయన మాట్లాడారు. ఇటీవల కురిసిన వడగండ్ల వర్షానికి పలుచోట్ల నష్టం వాటిల్లిందని, ముఖ్యంగా పొట్టదశలో ఉన్న వరి పంటతోపాటు మామిడి, నిమ్మ తోటలపై ఎక్కువ ప్రభావం పడిందని తెలిపారు. వరి నేల వాలడంతో పాటు పండ్ల తోటల్లో కాయలు, పండ్లు నేలరాలాయని అన్నారు. అకాల వర్షం కారణంగా జరిగిన నష్టంతో రైతులు ఆందోళనలో ఉన్నారన్నారు. ఈ కష్టకాలంలో రైతులను ఆదుకోవాలని ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఈమెయిల్ ద్వారా లేఖ పంపి విజ్ఞప్తి చేశారు.



తిరుమలగిరిలో ఉగాది సంబురాలు

నవతెలంగాణ-నార్కట్‌పల్లి



మండల పరిధిలోని తిరుమలగిరిలో శ్రీ శోభకృత్ నామ సంవత్సర ఉగాది పండగ సందర్భంగా బుధవారం భక్తాం జనేయ స్వామీ దేవాలయంలో ఆ గ్రామ ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉగాది పచ్చడి, పంచాంగ శ్రవణం కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు ఉత్తర పెళ్లి నరసింహాచార్యులు, తిరుమలగిరి ఉపసర్పంచ్ చెన్నబోయిన నాగేష్ యాదవ్, బోడ శీను, కన్నెబోయిన వెంకన్న, బెల్లి పర్వతాలు, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నైబాయిలో ఉగాది వేడుకలు

నవతెలంగాణ-నార్కట్‌పల్లి



మండల పరిధిలోని ఎడవల్లి గ్రామపంచాయతీ పరిధిలోగల ఆవాస గ్రామమైన నైబాయిలో ఉగాది వేడుకలు బుధవారం అర్చకులు జానకిరామ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సామ నరేందర్‌రెడ్డి, సోమ యుగేందర్‌రెడ్డి, సోమ వెంకట్‌రెడ్డి, పాశం గోపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సత్తిరెడ్డి, నర్సిరెడ్డి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఉగాది వేడుకలు

- అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షులు వాసుదేవశర్మచే పంచాంగ శ్రవణం
- ఆకట్టుకున్న బాలు మాస్టర్ కళాకారుల శాస్త్రీయ నృత్య ప్రదర్శన

నవతెలంగాణ-నల్లగొండ



శోభకృత్ నామ ఉగాది పర్వదిన సందర్భంగా బుధవారం నల్లగొండ శాసనసభ్యులు కంచర్ల భూపాల్‌రెడ్డి వీటి కాలనీలోని క్యాంప్ కార్యాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాష్ట్ర అర్చక సంఘం అధ్యక్షులు దౌలతాబాద్ వాసుదేవశర్మ పంచాంగ శ్రవణం ఆసక్తికరంగా కొనసాగింది. ఈ సంవత్సరం పంచాంగ ఫలితాలలో ధన, ధాన్య సమృద్ధి, ఆరోగ్య క్షేమం, సుభిక్షం కలుగుతుందని, ముఖ్యమంత్రికి ఇటు నల్లగొండ ఎమ్మెల్యేకి గోచార రీత్యా శుభం కలుగుతుందని, మంచి విజయాలు సాధిస్తారని, రాజకీయ ఉన్నతి కలుగుతుందని తెలిపారు. బాలు మాస్టర్ నేతృత్వంలో చిన్నారులతో నిర్వహించిన శాస్త్రీయ నృత్యం ఆహూతులను ఆకట్టుకున్నది. అనంతరం 50 మంది, వేద పండితులు, కవులు, రచయితలు గాయకులు, కళాకారులు, యోగా గురువులను, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులను ఘనంగా సన్మానించి ఉగాది పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా కంచర్ల మాట్లాడుతూ ఈ సంవత్సరం ప్రజలందరు ఆయురారోగ్యాలతో పాడి పంటలతో సుభిక్షంగా ఉంటారని పంచాంగంలో తెలియజేయటం చాలా సంతోషకరమైన విషయమన్నారు. ముఖ్యమంత్రి నేతృత్వంలో నల్లగొండ నలు వైపులా జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను కవులు, రచయితలు, కళాకారులు, మేధావులు, చర్చించుకోని ప్రజలకు మంచి సందేశాన్ని పంపించాలని కోరారు. ఈ నూతన సంవత్సరంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను తీసుకొని నియోజకవర్గ అభివృద్ధికి తాము శక్తి వంచన లేకుండా కృషిచేసి ప్రజలు కోరుకున్న మార్పును తీసుకోస్తామని తెలిపారు. ఈ సందర్భంగా నల్లగొండ ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్‌ని ఉగాది పురస్కారంతో ఘనంగా సన్మానించారు. ఉగాది పురస్కారాలు పొందిన వారిలో



కాటేపల్లి పెద్ద వెంకట నరసయ్య, పున్నమి అంజయ్య, రామచంద్రారెడ్డి శీలం భద్రయ్య, గజవెల్లి సత్యం కత్తుల శంకర్, డాక్టర్ కవిత కోమిశెట్టి, రమాదేవి, యోగా గురువు నాగేశ్వరరావు, రవీంద్ర చారి, నాట్య కళాకారులు సాయి సుధా తేజస్విని, తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ మున్సిపల్ చైర్మెన్ మందడి సైదిరెడ్డి, వైస్ చైర్మెన్ అబ్బగోని రమేష్, కనగల్ ఎంపీపీ ఎస్‌కే.కరీం పాషా, గ్రంథాలయ చైర్మెన్ రేగట్టే మల్లికార్జున్‌రెడ్డి, నాయకులు చీర పంకజ్‌యాదవ్, కటికం సత్తయ్యగౌడ్, బొర్ర సుధాకర్, బక్క పిచ్చయ్య, ఫరీదోద్దీన్, మాలే శరణ్యరెడ్డి, అభిమన్యు శ్రీనివాస్, బోనగిరి దేవేందర్, కార్యదర్శి సందినేని జనార్దన్‌రావు, మండల అధ్యక్షులు అయితగోని యాదయ్య, దేప వెంకట్ రెడ్డి, కౌన్సిలర్లు యామా కవితా దయాకర్, ఎడ్ల శ్రీనివాస్ యాదవ్, వట్టిపల్లి శ్రీనివాస్, గోగుల శ్రీనివాస్ యాదవ్, ఊట్కూరు వెంకట్‌రెడ్డి, రామాలయం దేవాలయ చైర్మెన్‌లు చకిలం వేణుగోపాలరావు, గంట్ల అనంతరెడ్డి, సూర మహేష్, నాయకులు రావుల శ్రీనివాసరెడ్డి, పొనుగోటి జనార్దన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కవిత్వానికి మూలం విద్య

- టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జంగయ్య

నవతెలంగాణ-నల్లగొండ



కవిత్వానికి మూలం విద్య అని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జంగయ్య అన్నారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని టీఎస్‌యూటీఎఫ్ నల్లగొండ జిల్లా కార్యాలయంలో బుధవారం సామాజిక కవి సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వాలు అందరికీ సమానమైన నాణ్యమైన విద్య అందించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానం వల్ల అసమానతలు పెరిగి పేద వర్గాల వారు విద్యకు దూరమయ్యే అవకాశాలు ఉన్నాయని, కాబట్టి నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని కోరారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న అన్ని సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధంగా ఉండాలని ఉపాధ్యాయులకు తెలియజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కవితా సమ్మేళనంలో అనేక మంది కవులు సమాజంలో విద్య విలువను తెలియజేశారు. అందరికీ విద్యను అందించడం ద్వారానే సమాజంలో అసమానతలు జరగకుండా ఉంటాయని పేర్కొన్నారు. అనంతరం కవులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, కవులు సుంకిరెడ్డి నారాయణరెడ్డి, బైరెడ్డి కృష్ణారెడ్డి, మేరెడ్డి యాదగిరిరెడ్డి, పురుషోత్తమాచార్యులు చొల్లేటి ప్రభాకర్, సాగర్ల సత్తయ్య, గేర నరసింహ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎడ్ల సైదులు, పెరుమాళ్ళ వెంకటేశం, కోశాధికారి నర్రా శేఖర్‌రెడ్డి, పగిళ్ల సైదులు, ప్రభాకర్, నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ముస్లిముల సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్యే భాస్కర్‌రావు

నవతెలంగాణ-మిర్యాలగూడ

ముస్లింలు సమస్యలు పరిష్కారానికి తన వంతు కృషి చేస్తామని స్థానిక ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. బుధవారం మిర్యాలగూడ ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు అహ్మద్ చావుష్ అధ్యక్షతన అసోసియేన్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పలువురు షాదీఖాన, ఈద్గా ప్రహరి గోడ, పట్టా తదితర సమస్యలపై వారికి విన్నవించుకోగా పరిష్కరిస్తామన్నారు. మునిసిపల్ చైర్మెన్ భార్గవ్ మాట్లాడుతూ మిర్యాలగూడ హిందు ముస్లింల ఐక్యతకు నిదర్శనమని, ఏ సమస్య వచ్చినప్పుడు సమన్వయంతో పరిష్కరించుకున్నామన్నారు. ఈ సమావేశంలో మస్జిద్ కమిటీల అధ్యక్షులు, కౌన్సిలర్లు, ముఫ్తీలు, మౌలానాలు, నాయకులు పాల్గొన్నారు.



పంచాంగ శ్రవణంలో ఎమ్మెల్యే చిరుమర్తి

నవతెలంగాణ-నకిరేకల్

నకిరేకల్ నియోజకవర్గం కేంద్రంలోని రామలింగేశ్వర స్వామి, షిరిడి సాయిబాబా దేవాలయంలో ఉగాది పర్వదినం సందర్భంగా బుధవారం ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, వేద ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిరుమర్తి దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీ శోభకృత్ నామ సంవత్సర పంచాంగ శ్రవణం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మాద ధనలక్ష్మి నగేష్‌గౌడ్, మున్సిపల్ చైర్మెన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

జన చైతన్యానికి జేవీవీ కృషి ప్రశంసనీయం

నవతెలంగాణ-నకిరేకల్



జనచైతన్యం కోసం జన విజ్ఞాన వేదిక చేస్తున్న కృషి ప్రశంసనీయమని మున్సపల్ చైర్మెన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. బుధవారం ఉగాది పండుగను పురస్కరించుకొని జేవీవీ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి వితరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర కమిటీ సభ్యులు కనుకుంట్ల విద్యాసాగర్‌రెడ్డి, ఉద్యానశాఖ నియోజకవర్గ అధికారి రావుల విద్యాసాగర్, జిల్లా బాధ్యులు వాలుగొండ వెంకటేశ్వర్లు, వంటెపాక నగేష్, మండల ప్రధాన కార్యదర్శి చల్లోజు శ్రీనివాస్, బుడిగె సుధాకర్, బాధ్యులు గంగాధరి భద్రయ్య, పుట్ట దామోదర్ పాల్గొన్నారు.

జెడ్పీ చైర్మెన్ బండా నరేందర్‌రెడ్డి ప్రత్యేకపూజలు

నవతెలంగాణ-నార్కట్‌పల్లి



శోభకృత్ నామ సంవత్సర ఉగాది పండుగను పురస్కరించుకొని బుధవారం మండల పరిధిలోని నక్కలపల్లి గ్రామంలో శ్రీ భక్తంజనేయ స్వామి ఆలయంలో జెడ్పీ చైర్మెన్ బండ నరెందర్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఈద మాదవి నర్సింహా, ఎంపీటీసీ కనుకు అంజయ్య, వార్డ్ సభ్యులు భాషపాక ఉమా రవి, గుత్త కరుణాకర్ రెడ్డి, వల్లపు శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

శాంతి కమిటీ సమావేశం



నవతెలంగాణ-తిరుమలగిరిసాగర్

రంజాన్ నెల ప్రారంభం కానున్న నేపద్యంలో పోలీసు వారి ఆధ్వర్యంలో మండలంలోని ముస్లిం సోదరులకు స్థానిక పోలీసు స్టేషన్‌లో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ నాగరాజు మాట్లాడుతూ ప్రజలంతా ఐకమత్యంతో, సోదరాభావంతో కలిసి మెలిసి పండగలు నిర్వహించుకోవాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలగ కుండా సామరస్యంగా శాంతియుతంగా నెల రోజుల పాటు ఉపవాసాలు, ప్రార్థనలు చేసుకోవాలని సూచించారు. సామాజిక మాధ్యమాలను దుర్వినియోగం చేస్తూ ప్రజలలో విద్వేషాలను సృష్టించే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. పండగ సమయాలలో వ్యక్తులు ఏ ఇతర మతవిశ్వాసలకు భంగం కలిగించే చర్యలకు పాల్పడితే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే విదంగా ఉండే పోస్టులు పెట్టి ఎక్కడో జరిగిన సంఘటనను వక్రీకరిస్తూ ఉహాజనితమైన పోస్టులు పెటడంకూడ నేరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ పెద్దపంగ బాబు, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ రహీం, ఎండీ.సుబాన్, రసూల్, చాంద్ పాషా, మౌలానా, మోహిన్ పాషా, జావీద్, గౌసు, మహమ్మద్, గాలిసాహెబ్, ఇబ్రహీం, రహీం, నజీర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రకృతి పానీయాలు ఆరోగ్యానికి మేలు

నవతెలంగాణ-నల్లగొండ

ప్రకృతిలో లభించే పానీయాల వల్ల ఆరోగ్యాలకు ఎంతో మేలు జరుగుతుందని, కృత్రిమమైన పానీయాల వల్ల ఆరోగ్యాలు పాడవుతాయని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జంగయ్య అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని గడియారం సెంటర్‌లో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని హానికరమైన కృత్రిమ పానీయాలు మానేద్దాం- ప్రకృతి పాణియాలు సేవిద్దాం అనే నినాదంతో ఉగాది పచ్చడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రకృతిలో లభించే పానీయాల వల్ల ఆరోగ్యాలకు ఎంతో మేలు జరుగుతుందని, కృత్రిమమైన పానీయాల వల్ల ఆరోగ్యాలు పాడవుతాయని అందరూ ప్రకృతి పానీయాలు సేవించాలని, ఆరోగ్యాలు కాపాడుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటుచేసిన టీఎస్ యూటీఎఫ్, జన విజ్ఞాన వేదిక జిల్లా కమిటీలను అభినందించారు. ఈ కార్యక్రమానికి మరో ముఖ్యఅతిథిగా విచ్చేసిన నల్లగొండ జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతికి పానీయాలను అందజేస్తూ ఇలాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి నన్నూరు వెంకటరమణారెడ్డి, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎడ్ల సైదులు, పెరుమాళ్ళ వెంకటేశం, జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, సైదులు టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కోశాధికారి శేఖర్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు సిహెచ్.అరుణ, జిల్లా కార్యదర్శి గేర నరసింహ, నల్లపురాజు వెంకన్న, రమాదేవి ఆడిట్ కమిటీ జిల్లా కన్వీనర్ ఎం. మురళి, సోషల్ మీడియా కన్వీనర్ ఎరనాగుల సైదులు, ఆడిట్ కమిటీ సభ్యులు సైదులు, ప్రచురణాల కమిటీ కన్వీనర్ శ్యామ్ కుమార్, అక్కడమిక్ కన్వీనర్ పగిడిపాటి నరసింహ, మండల బాధ్యులు సిహెచ్.రవీందర్, సైదులు, రమణ, కృష్ణ, రాజశేఖర్‌రెడ్డి, నాగయ్య, ఆదిమల్ల శ్రీనివాస్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తీపి, చేదు సమ్మేళనమే ఉగాది



నవతెలంగాణ-నకిరేకల్

తీపి, చేదుల కలయికే ఉగాది అని మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని పన్నాలగూడెం క్యాంపు కార్యాలయంలో పంచాంగ శ్రవణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శోభకృత్ నామ సంవత్సరం తెలుగు ప్రజల జీవితాలలో కొత్త ఉషస్సులు నింపాలని ఆకాంక్షించారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా పడి పాడిపంటలతో, పసిడి కాంతులతో రాష్ట్రం వెలుగొందాలని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం శస్యశ్యామలమై సంక్షేమ అభివృద్ధిలో అగ్రగామిగా కొనసాగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ పూజర్ల శంభయ్య, కౌన్సిలర్లు, నాయకులు, పాల్గొన్నారు.

దాసరిరామక్కకు నివాళులు

నవతెలంగాణ-నార్కట్‌పల్లి



మండల పరిధిలోని నక్కలపల్లి (పెద్దబావిగూడెం)గ్రామానికి చెందిన దాసరి రామక్క బుధవారం మృతి చెందారు. ఆమె మృతదేహానికి జడ్పీ చైర్మెన్ బండ నరెందర్‌రెడ్డి పూలమాల వేసి నివాళు లర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఈద మాదవి నర్సింహా, ఎంపీటీసీ కనుకు అంజయ్య, వార్డు సభ్యులు భాషపాక ఉమా రవి, గుత్త కరుణాకర్‌రెడ్డి, వరికుప్పల శ్రీను, గడ్డగూటి సైదులు, డెంకల సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

యువతకు మార్గదర్శి ముకేశ్

- కిట్ల పంపిణీ అభినందనీయం
- హ్యూమన్ రైట్స్ డిఫెండర్ హమీద్ షేక్

నవతెలంగాణ-మిర్యాలగూడ



మిర్యాలగూడ పట్టణానికి చెందిన బీఆర్‌ఎస్ సోషల్ మీడియా వారియర్ నర్రా ముకేష్‌చౌదరీ యువతకు మార్గదర్శిగా నిలిచారని ప్రఖ్యాత సోషల్ సర్వీస్ ఆర్గనైజర్, హ్యూమన్ రైట్స్ డిఫెండర్ హమీద్ షేక్ అభివర్ణించారు. పవిత్ర రంజాన్ మాసంలో 10 ముస్లిం కుటుంబాలకు సేమియా కిట్లు పంపిణీ చేసేందుకు ఆయన ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో నర్రా ముకేష్ చౌదరీ ఆర్థిక సహకారంతో అందజేసిన కిట్లను హమీద్ షేక్ పంపిణీ చేశారు. రంజాన్ ఉపవాస దీక్షలను ముస్లిం సోదరసోదరీమణులు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించాలని ఆకాంక్షించారు. సేవా నిరతితో, సహృద్భావంతో పలు ముస్లిం కుటుంబాలకు తన వంతుగా సాయం అందించేందుకు ముందుకు వచ్చిన నర్రా ముకేష్ చౌదరీ ఆలోచనా సరళి ప్రశస్తమైందన్నారు. నర్రా ముకేష్ చౌదరీ సర్వమత సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలిచారని హమీద్ షేక్ ప్రశంసించారు. యువత సమాజసేవలో కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మసూద్, సర్దార్, జనీపాషా, తదితరులు పాల్గొన్నారు.

మల్లికార్జున స్వామి కల్యాణం



నవతెలంగాణ-చిట్యాలటౌన్

పట్టణంలోని భువనగిరి రోడ్డులో మల్లన్న గుట్టపై కొలువై ఉన్న శ్రీ మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవాన్ని ఏళ్ల వంశస్థులు ఉగాది పర్వదినం రోజున ఘనంగా జరుపుకున్నారు. మల్లన్న దేవుని పండుగను పురస్కరించుకొని అనాదిగా స్వామివారి కళ్యాణం నిర్వహిస్తూ వస్తున్నారు. మంగళవారం సాయంత్రం పట్టణంలోని ఏళ్ల వంశస్థులు అధిక సంఖ్యలో డోలు వాయిద్యాలతో రంగురంగులు, పూలతో అలంకరింపబడిన గంపలతో గుట్టమీదికి వెళ్లారు. స్వామివారి విగ్రహాన్ని మోసుకుని వెళ్లి అగ్నిగుండాలు తొక్కారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి చైర్మెన్ కోమటిరెడ్డి చిన్న వెంకటరెడ్డి, వైస్ చైర్మెన్ కూరెళ్ళ లింగస్వామి, కౌన్సిలర్లు, పలు పార్టీల నాయకులు పాల్గొని స్వామి వారి పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కళ్యాణ మహోత్సవంలో ఏళ్ల వంశస్థులు పాల్గొన్నారు.



ఉగాది..పంచాంగం

నవతెలంగాణ-మిర్యాలగూడ

పట్టణంలోని మార్కండేయ స్వామి వేదికలో శుభకృత నామ సంవత్సర ఉగాది పండుగ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. పంచాంగం శ్రావణం నిర్వహించారు. ఈ సంవత్సరంలో ఆయా నక్షత్రం వారికి కలిగే లాభనష్టాలు, భోగభాగ్యాలు, భోజ్యం, అవమానాలు వివరించారు. ఆయా రాశుల వారికి ఫలితాలను, ఆరోగ్య విషయాలు వివరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షులు నామిని సోమయ్య, కన్వీనర్ భవాండ్ల పాండు, ప్రధాన కార్యదర్శి జల్లా బిక్షం, కోశాధికారి రామప్రసాద్, చెరుపల్లి చంద్రమౌలి, చిలుకూరి బాలు, వెంకటేశం, గంజి యాదగిరి, చిలుకూరి శ్యామ్ మిర్యాల చంద్రమౌలి, కోడి జనార్దన్, మసరం వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

విద్యుద్ఘాతంతో రైతు మృతి

నవతెలంగాణ-నకిరేకల్



మండలంలోని మంగళపల్లి గ్రామానికి చెందిన రైతు పున్నపురాజు సత్తయ్య (50) విద్యుత్ ఘాతానికి గురై బుధవారం సాయంత్రం మృతి చెందారు. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన సత్తయ్య తన వ్యవసాయ బావి వద్ద కరెంటు షాక్‌కు గురై మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని స్థానిక సర్పంచ్ ప్రగడపు నవీన్‌రావు, స్థానికులు సందర్శించారు.

అన్నిరంగాల్లోనూ అభివృద్ధి

నవతెలంగాణ-మిర్యాలగూడ

తెలుగు సంవత్సరాది శోభకృత్ నామ సంవత్సరం సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలు సమృద్ధిగా పండుతాయని వేద బ్రహ్మణులు పేర్కొన్నారు. బుధవారం ఉగాది పండుగ సందర్భంగా పలు దేవాలయాల్లో పంచాంగ పఠనం చేసిన పండితులు శోభకృత్ నామ సంవత్సరంలో అన్నీ శుభాలే జరుగుతాయని తెలిపారు. రాజకీయ నాయకులకు మంచి భవిష్యత్తు ఉంటుందని, భారతదేశం ఆర్థికంగా వృద్ధి చెంది మొదటి స్థానంలో ఉంటుందని, ఆహార ధాన్యలు ప్రపంచ దేశాలకు ఎగుమతి చేస్తుంది, ప్రపంచ శాంతితో ముందుకు నడుస్తుంది తెలిపారు. అనంతరం రాశుల వారీగా ఆదాయ, వ్యయాలు, రాశి ఫలాలు తెలిపారు.

మంత్రిని కలిసిన సంజయ్‌దాస్

నవతెలంగాణ-చిట్యాలటౌన్



సూర్యాపేట క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డిని బుధవారం బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కూనూరు సంజయ్‌దాస్‌గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంత్రి జగదీశ్‌రెడ్డికి జ్ఞాపికను బహూకరించారు. నూతన తెలుగు సంవత్సరంలో అందరికి మంచి జరగాలని, మళ్ళీ సీఎం కేసీఆర్ నేతృత్వంలో బీఆర్‌ఎస్ తెలంగణ రాష్టంలో అధికారంలో రావడం తథ్యమని మంత్రి అన్నారు.

అనారోగ్యంతో ఉపసర్పంచ్ తండ్రి మృతి

నవతెలంగాణ-చివ్వెంల

మండలపరిధిలోని తిమ్మాపురం ఉపసర్పంచ్ మంజూరుబాబా తండ్రి ఖాదర్ బాబా బుధవారం మరణించారు.కాగా అతని కుటుంబాన్ని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి ఓదార్చారు.



కుటుంబ తగాదాలతో వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-తుంగతుర్తి

ఆస్తి పంపకాల విషయంలో ఏర్పడిన తగాదాలతో వృద్ధుడు తీవ్ర మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలపరిధిలోని దేవునిగుట్టతండాలో బుధవారం చోటు చేసుకుంది.ఎస్సై డానియల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..తండాకు చెందిన బానోత్‌తాక్రు(60)ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉదయం 11 గంటలకు ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.మృతునికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు.కొన్ని రోజులుగా ఇంట్లో ఆస్తి విషయంలో కుటుంబ తగాదాలు జరుగుతున్నాయి.దీంతో తీవ్ర మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.మృతుడి భార్య బానోతు పూలమ్మ ఫిర్యాదు మేరకుపోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



చేతులు కలిపిన దామన్న,కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

- రేవంత్‌రెడ్డిపై కోపంతో ఇరువురు ఒకటయ్యారా
- దామన్నతో స్నేహ హస్తం చాచిన కోమటిరెడ్డి..?
- ఇద్దరి కలయిక పార్టీలో ఎటు దారితీస్తుందో!

నవతెలంగాణ-సూర్యాపేట

కొన్ని దశాబ్దాలుగా వారిద్దరి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేపరిస్థితి ఉండేది.ఒకరికొకరు వర్గ విబేధాలతో నిత్యం రగిలి పోయే వారు.నియోజకవర్గంలో అడుగు పెడితే ఆ రోజు తప్పనిసరిగా విధ్వంసం, గొడవలు, కొట్లాటలకు దారితీసేవి.ఈ నేపథ్యంలో ఇరువురి వర్గాలపై కేసులు కూడా నమోదై కోర్టు చుట్టూ కూడా తిరిగారు.ఇక వారి కలయిక సాధ్యం కాదని ఆ పార్టీ అధిష్టానంతో పాటు సీనియర్లు, పెద్దలు, పార్టీ కార్యకర్తలు భావించారు.కానీ వారిద్దరూ ఊహించని షాక్ ఇచ్చారు.ఉప్పునిప్పుగా ఉండే ఆ ఇద్దరు చేయిచేయి కలిపారు. ప్రస్తుతం ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఆ ఇద్దరు నాయకుల కలయిక చర్చనీయాంశంగా మారింది.వారే మాజీమంత్రి, టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు రాంరెడ్డి దామోదర్‌రెడ్డి,భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి కలిసి నిర్వహించిన పర్యటన హాట్ టాపిక్‌గా మారింది.తుంగతుర్తి నియోజకవర్గంలోని తిరుమలగిరి మండలంలోని పలు గ్రామాల్లో అకాల వర్షాలు, వడగండ్ల వానతో నష్టపోయిన రైతులను మంగళవారం వారు



పరామర్శించారు.ఇద్దరు కలిసి వడగండ్ల వానలతో నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారం పేరిట రైతు దీక్షలు చేశారు.రేవంత్‌రెడ్డిపై ఉన్న కోపమే ఇద్దరి నాయకులను కలిపిందా..? శత్రువు-శత్రువు మిత్రుడు అనే నానుడి ఇద్దర్ని ఏకంచేసిందా..ఉప్పు-నిప్పుగా ఉండే ఇద్దరు నాయకులు ఒకే వేదికపై



ప్రసంగించడం కార్యకర్తల్లో ఆనందంతో పాటు ఆశ్చర్యం కలిగించింది.ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కాంగ్రెస్ గ్రూపు రాజకీయాలకు పెట్టింది పేరు.అంతా కూడా సీనియర్ నాయకులే అయినా ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా ఎప్పుడు కూడా కలిసి పని చేసింది లేదు.ఎవరి గుంపు వారిదే.పార్టీ బలంగా ఉన్నా నాయకుల నడుమ ఐక్యత లేక ఉమ్మడి నల్గొండ జిల్లాలో పార్టీ బలహీన పడింది.ఈ క్రమంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సీనియర్ నాయకులు కుందూరు జానారెడ్డి, రాంరెడ్డి దామోదర్‌రెడ్డిలు ఆ తరువాతితరంగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిగా పేరుగాంచారు.ఇందులో అందరూ పైకి నవ్వుతూ కలిసి కనిపించిన ఒకరికొకరి మధ్య సఖ్యత ఉండదనేది బహిరంగ రహస్యమే.ఇటీవల పార్టీ పరిణామాల నేపథ్యంలో నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి,ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి మధ్య పొసగడం లేదు.ప్రధానంగా మునుగోడు ఉపఎన్నిక సమయంలో కోమటిరెడ్డికి చెక్ పెట్టె క్రమంలో రేవంత్‌రెడ్డి మాజీమంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డిని ప్రత్యామ్నాయంగా ముందుకు తెచ్చి ఉపఎన్నికలో ప్రధాన బాధ్యతలు అప్పగించారు.కోమటిరెడ్డిని ఒక వైపు దూషిస్తూనే మరోవైపు దామోదర్‌రెడ్డిని టైగర్ దామన్నా అని సంబోధిస్తూ ఇద్దరి మధ్యవైరాన్ని వాడుకున్నారు.తన ప్రాబల్యం ఉన్న సూర్యాపేట,తుంగతుర్తి నియోజక వర్గాల్లో కోమటిరెడ్డి వర్గాలను ప్రోత్సహిస్తున్నాడని తనకి తెలియకుండా తన ప్రాంతాలకు వచ్చి హడావుడి చేస్తుండడంతో గతంలో,ఇటీవలే కాలంలో కూడా తుంగతుర్తి,సూర్యాపేటలలో కోమటిరెడ్డిపై దామన్న వర్గీయులు దాడి చేసిన విషయం తెలిసిందే.ఇదిగాక కోమటిరెడ్డి తనకు వ్యతిరేకమైన పటేల్ రమేష్‌రెడ్డికి అనుకూలంగా పరోక్షంగా ప్రోత్సహిస్తున్నాడనే కోపంతో దామన్న రగిలిపోయే వారు.వీరి మధ్య వైర్యం ఇలా నడుస్తుండగా... సూర్యాపేట డీసీసీ విషయంలో తన అనుచరుడు చెవిటి వెంకన్నయాదవ్ పేరును ప్రకటించాలని ఉత్తమ్‌తో సహా దామోదర్‌రెడ్డిలు రేవంత్‌రెడ్డిని కోరారు. అన్ని జిల్లాల్లో డీసీసీ నియామకాలు జరగగా సూర్యాపేట డీసీసీ పై అధిష్టానం నిర్ణయం ప్రకటించకుండా ఇంకా నాన్చుతుంది. ఇదిగాక సూర్యాపేట అసెంబ్లీ టికెట్ విషయంలో రమేష్‌రెడ్డిని తెరమీదకు తెచ్చి రేవంత్‌రెడ్డి అనిశ్చితికి కారణమయ్యాడని దామోదర్‌రెడ్డి లోపల రగిలిపోతున్నారు.ఈ రెండు విషయాలు దామోదర్‌రెడ్డిని కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయనేది తెలిసిందే. కాగా మునుగోడు ఎన్నికల కోసం రేవంత్‌రెడ్డి చెప్పినట్లు చేసినా తనకు సంబంధించిన వాటిపై పట్టించుకోకపోవడంపై దామన్న అసహనంతో ఉన్నారు.ఈ నేపథ్యంలో 2017 లో టీడీపీ నుండి కాంగ్రెస్‌లో చేరిన వారు పార్టీకి నష్టం చేస్తున్నారని దామోదర్‌రెడ్డి రాష్ట్ర ఇన్‌చార్జి ఠాక్రే కోదాడకు వచ్చిన సమయంలో తొలిసారిగా ఆయన రమేష్‌రెడ్డిపై ఫిర్యాదు చేశారు.అయినా కూడా రమేశ్‌రెడ్డి పాదయాత్ర నియోజకవర్గంలో కొనసాగుతూనే ఉంది. రేవంత్‌రెడ్డికి చెక్ పెట్టాలని ఆశిస్తున్న కోమటిరెడ్డి దామోదర్ రెడ్డికి స్నేహ హస్తం చాటినట్టుగా సమాచారం.దామోదర్‌రెడ్డి కూడా విబేధాలను పక్కకు నెట్టి భవిష్యత్ కార్యాచరణ లో భాగంగా కోమటిరెడ్డితో కలిసి రాజకీయ ఎత్తుగడలకు సిద్ధపడుతున్నట్టు



విశ్లేషకులు భావిస్తున్నారు.తిరుమలగిరి మండలంలో ఇరువురు కూడా హుషారుగా పాల్గొనడంతో పాటు ఒకరికొకరు ఆలింగనం చేసుకొని రహస్యమంతనాలు జరుపుకోవడం చర్చనీయాంశంగా మారింది. మరి ఈ క్రమంలో ఈ ఇద్దరి కలయిక ముముందు ఎలాంటి పరిణామాలకు దారి తీస్తుందోనని... రాజకీయ సమీకరణాలు కూడా మరింత రసవత్తరంగా మారే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.



ఈదర సత్యనారాయణ ఆశయాలు సాధించాలి

నవతెలంగాణ-కోదాడరూరల్

సత్యనారాయణ ఆశయాలు సాధించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మేదరమెట్ల వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం పట్టణంలో రిటైర్డ్ టీచర్, యూటీఎఫ్ నాయకులు, సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు ఈదర సత్యనారాయణ మృతికి సీపీఐ(ఎం) ప్రగాఢ సానుభూతి సంతాపాన్ని తెలియజేస్తుందని జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మెదరమెట్ల వెంకటేశ్వరరావు తెలిపారు. ఆయన మృతదేహానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత కొంతకాలంగా వామపక్ష భావాలు కలిగి యూటీఎఫ్‌లో పనిచేస్తూ ఉపాధ్యాయ రంగాన్ని పెంపొందిస్తూ అన్నివేళలా విద్యార్థులకు విద్యను అభ్యసిస్తూ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై అనేక పోరాటాలు చేశారన్నారు. ఉద్యోగ విరమణ తర్వాత సీపీఐ(ఎం) టౌన్ కార్యదర్శిగా పనిచేస్తూ బడుగు బలహీన వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపైన అనేక ఉద్యమాలు నిర్వహించి గత ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్య పరుస్తూ కోదాడ పట్టణంలో ప్రజా సమస్యలు పరిష్కరించాలని ఉద్యమాలు నిర్వహించిన వ్యక్తి ఈదర సత్యనారాయణ అన్నారు. అనంతరం పబ్లిక్ క్లబ్ అధ్యక్షుడిగా కొనసాగి ప్రజల మన్ననలను పొందిన ఆయన పోరాట స్ఫూర్తిని అందుకొని ప్రతి ఒక్కరు ముందుకు నడవాలన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు జుట్టుకొండ బసవయ్య, పట్టణ కార్యదర్శి ఎం. ముత్యాలు, సీఐటీయూ జిల్లా కోశాధికారి కోటగిరి వెంకటనారాయణ, సహాయ కార్యదర్శి ఎస్.రాధాకృష్ణ, టౌన్ కమిటీ సభ్యులు షేక్ రెహమాన్, శ్రీనివాస్, ఎం.వెంకటేశ్వర్లు, భీమయ్య, నవీన్, మరియన్న, తదితరులు పాల్గొన్నారు.



మంత్రికి ఉగాది శుభాకాంక్షలు తెలిపిన జెడ్పీటీసీ, బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-నూతనకల్

రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డికి బుధవారం జిల్లాకేంద్రంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో జెడ్పీటీసీ కందాల దామోదర్‌రెడ్డి,బీఆర్ఎస్ జిల్లా నాయకులు పన్నాల సైదిరెడ్డి మంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.శాలువా కప్పి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో మండల బీఆర్ఎస్ నాయకులు లింగయ్య,పెద్దింటి అచ్చిరెడ్డి ఉన్నారు.

శుభకృత్ నామ సంవత్సర ఉగాది వేడుకలను మండలకేంద్రంతో పాటు మండల పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు.ఈ సందర్భంగా ఆరు రుచులతో తయారు చేసిన ఉగాది పచ్చడిలో సేవించారు.ఇండ్లను మామిడి ఆకులతో అలంకరించుకొని కంకణాలను కట్టుకొని నూతన వస్త్రాలను ధరించాలంటూ ఈ ఏడాది సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నారు.అనంతరం దేవాలయాల వద్ద పురోహితుడు పంచాంగాన్ని చదివి వినిపించారు.ఈకార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు,ఎంపీటీసీలు, రాజకీయ నాయకులు పాల్గొన్నారు.



మంత్రికి పండుగ శుభాకాంక్షలు తెలిపిన కౌన్సిలర్

నవతెలంగాణ-సూర్యాపేట

ఉగాది పండుగను పురస్కరించుకుని 45వ వార్డు కౌన్సిలర్ గండూరి పావని కృపాకర్ బుధవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర విద్యుత్ శాఖ మాత్యులు గుంటకండ్ల జగదీశ్‌రెడ్డిని కలిసి శోభకృత్ తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు.శుభాకాంక్షలు తెలిపిన వారిలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు గండూరి కృపాకర్, నూకల మధుసూదన్‌రెడ్డి, నూకలవెంకట్‌రెడ్డి, తేరటపల్లి సతీష్, కస్తూరినవీన్, వార్డు నాయకులు బెజగం ఫణి, ఇస్మాయిల్, కల్యాణ్ ఉన్నారు.

చనిపోయిన విద్యార్థుల కుటుంబాలకు ప్రభుత్వఉద్యోగం కల్పించాలి

నవతెలంగాణ-చివ్వెంల

మండలకేంద్రంలోని మహాత్మాజ్యోతిరావుపూలే బీసీవసతి గృహంలో నీటిసంపు గోడ కూలి మృతి చెందిన ఇద్దరు విద్యార్థుల కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని ప్రజాతంత్ర విద్యార్థి సంస్థ జిల్లా కన్వీనర్ భాషపంగు సునీల్ డిమాండ్ చేశారు.బుధవారం మండలకేంద్రంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.... ఇద్దరు విద్యార్థులు మృతి కారణమైన పాఠశాల ప్రిన్సిపాల్, వార్డెన్ సస్పెండ్ చేయాలని కోరారు.ప్రభుత్వం రూ.2 లక్షలిచ్చి చేతులు దులుపుకుందన్నారు.కనీసం రూ.50 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల కుటుంబాలకు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగం కాకుండా ప్రభుత్వ ఉద్యోగం కేటాయించాలని, లేదంటే పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.వెంటనే నాగారం మండలకేంద్రానికి చెందిన గురుకుల పాఠశాలను ఇక్కడి నుండి నూతన భవనంలోకి తరలించాలని కోరారు.పాఠశాలలో మరుగుదొడ్ల నిర్వహణ, నీటి సంపులు సరిగా లేకపోవడంతో విద్యా ర్థులు బిక్కు బిక్కుమంటూ గడుపు తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కార్యక మంలో నాయకులు ఎర్ర సుమన్, కృష్ణ, గంధం భగత్, యాతకుల నరేందర్, తదితరులు పాల్గొన్నారు.



మంత్రి క్యాంపు కార్యాలయంలో వైభవంగా ఉగాది వేడుకలు

- ఆశీర్వచనం అందజేసిన వేదపడింతులు
- శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్ వెంకట్రావు, ఎస్పీ రాజేంద్రప్రసాద్

నవతెలంగాణ-సూర్యాపేట

పట్టణంలోని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో బుధవారం ఉగాది వేడుకలు వైభవంగా జరిగాయి.వేద





పండితులు మంత్రికి వేదాశీర్వచనం అందజేశారు.శోభకృత్ నామ ఉగాది రోజున తెలుగుదనం ఉట్టిపడేలా వస్త్రాలు ధరించిన మంత్రి క్యాంపు కార్యాలయంలో కలియతిరుగుతూ అధికారులకు, బీఆర్ఎస్ నేతలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.వేద పండితులు పంచాంగ శ్రవణాన్ని వినిపించి మకరరాశికి చెందిన మంత్రికి అంతా జయమే కలుగుతుందని తెలిపారు.ఆదేవిధంగా ముచ్చటగా మూడవసారి మంత్రి గెలుపొందడం ఖాయమని పేర్కొన్నారు.అనంతరం మంత్రి స్వయంగా ఉగాది పచ్చడిని తయారు చేసి కలెక్టర్ వెంకట్రావ్, ఎస్పీ రాజేంద్రప్రసాద్, అధికారులకు అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి



మాట్లాడుతూ శోభకృత్ నామ సంవత్సరంలో అందరికీ శుభం కలగాలని దేవుణ్ణి ప్రార్థిస్తున్నానన్నారు.ఎన్నో అపోహలు, అనుమానాల మధ్య పోరాటంతో తెలంగాణ సాధించామన్నారు. తెలంగాణ జాతి అంతా ఒక్కటేనని, ఇందులో ఉన్న ప్రతిఒక్కరూ సంతోషంగా ఉండాలన్నారు.నూతన తెలుగు సంవత్సరం సందర్భంగా పోలీసు, రెవెన్యూ, పంచాయతీ, వైద్య శాఖలకు చెందిన అధికారులు, బీఆర్ఎస్ కార్యకర్తలు, అభిమానులు మంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

నవవసంతాల సృష్టి కవుల బాధ్యత

- ప్రముఖ కవి ఏభూసి నర్సింహ

నవతెలంగాణ-భువనగిరి

ఉగాది పర్వదినం పురస్కరించుకొని స్థానిక బంజరాహిల్స్‌లోని దుంపల మల్లారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కవి సమ్మేళనం బుధవారం నిర్వహించారు.సమకాలీన సామాజిక అంశాలపై ప్రముఖ కవి ఏబూసి నర్సింహ అధ్యక్షతన నిర్వహించారు.సమ్మేళనంలో వారు మాట్లాడుతూ సమాజ గమనంలో నిరంతరం సామాజిక స్పృహతో నేటి సమాజ దుష్పరిణామాలపై పూలకళలు,గళాలు మానవీయ దృష్టితో నూతన నవవసంతాల సృష్టించే బాధ్యత కవులపై ఉందన్నారు. కవులు తమ కవితలను చదివి వినిపించారు.ఈ కార్యక్రమంలో డీఎంఎం ట్రస్ట్ కార్యదర్శి ఎండీ జహంగీర్, బట్టు రామచంద్రయ్య,కాచరాజు జయప్రకాష్, ఫసియోద్దీన్, సామమల్లారెడ్డి,డి.బాలనర్సయ్య, జిట్టా భాస్కర్‌రెడ్డి, ముత్తిరెడ్డి, కాషపాక మహేష్, ఈర్లపల్లి ముత్యాలు, ట్రస్టు కోశాధికారి మాటూరిబాలరాజు, ట్రస్టు సభ్యులు కోమటిరెడ్డిచంద్రారెడ్డి, గడ్డం వెంకటేష్ పాల్గొన్నారు.



సాహిత్యాభిరుచికి ప్రతీకలు ఉగాది కవి సమ్మేళనాలు

నవతెలంగాణ-కోదాడరూరల్

సాహిత్యాభిరుచికి ప్రతీకలు ఉగాది కవి సమ్మేళనాలని సాహితీవేత్తలు, విశ్రాంత ఆంధ్రోపన్యాసకులు మంత్రిప్రగడ భరతారావు, శ్రీరామకవచం వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం పట్టణంలోని గుంటి రఘునాథ స్వామి ఆలయంలో ఉగాది సందర్భంగా నిర్వహించిన కవి సమ్మేళనంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. పాశ్చాత్య సంస్కృతిలో కవులకు, సాహితీ వేత్తలకు గుర్తింపు లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కవి సమ్మేళనాలు సాహిత్య అభిరుచికి ప్రతీకలు అన్నారు. ప్రతి ఏడాది ఉగాది సందర్భంగా కవి సమ్మేళనం నిర్వహిస్తూ కవులను, సాహితీవేత్తలు ప్రోత్సహిస్తున్న గుంటి రఘునాథ స్వామి దేవాలయ కమిటీ వారు అభినందనీయులన్నారు. కాగా 40 మంది కవులు పలు సామాజిక, ఆధాత్మిక, సాహిత్య అంశాలపై కవితలు రాసి చదివి వినిపించారు. అనంతరం కవులను ఆలయ కమిటి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రచయిత సరికొండ రాజు రచించిన వర్ణాలు లేని వాక్యాలు అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఉగాది కవి సమ్మేళన కన్వీనర్ ఎస్ఎస్ రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మెన్ గుడుగుంట్ల రంగయ్య, ఎక్సైజ్ అధికారి వీ.సోమిరెడ్డి, కోదాడ రచయితల సంఘ అధ్యక్షులు పుప్పాల కృష్ణమూర్తి, నరసింహ రాజు, ధర్మ కర్తల మండలి సభ్యులు వేనేపల్లి శ్రీనివాసరావు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కొమరగిరి రంగారావు, కాటేపల్లి నరసింహరావు, గెల్లా లక్ష్మినారాయణ, పూజారి ఎన్‌సీహెచ్.రాఘవాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.



లైట్‌మోటర్ డ్రైవర్స్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-ఆలేరుటౌన్

ఆల్‌లైట్ మోటర్ డ్రైవర్ అసోసియేషన్ ఎన్నికలు మండలకేంద్రంలోని లక్ష్మీ గార్డెన్ ఆవరణలో సభ్యుల సమక్షంలో బుధవారం నిర్వహించారు.అధ్యక్షునిగా గోరంట్ల రాజు,ఓనర్స్ సొసైటీ అధ్యక్షునిగా మండల రామ్మూర్తి, సభ్యులుగా అజయ్, అనిల్, సతీష్, పాములపర్తిరామచంద్రారెడ్డి, వెంకటేష్, సుభాష్, రవి, రాము, జూకంటి వెంకటేష్, చందర్, శ్రీనివాస్‌రెడ్డి, సిరాజ్, జాని,అంకుష్, గణేష్,అంజిరెడ్డి, ఉపేందర్, స్వామి, రాజు, మహేష్



ఘనంగా ఉగాది వేడుకలు

నవతెలంగాణ-మద్దిరాల

నూతన శోభ కృత నామ సంవత్సర ఉగాది వేడుకలను గ్రామ సర్పంచ్ బరపటి ఉపేందర్ వేద పండితులు బ్రహ్మ చారి ఆధ్వర్యంలో నూతన సంవత్సర పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా నూతన ఆశయాలు చిగురించాలని పాడి పంటలతో రైతులు సుఖ సంతోషాలతో ఉండాలని పంచాంగ శ్రవణం చూయించుకున్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ నాగేల్లి శ్రీలత శ్రవణ్‌కుమార్, దేవాలయ కమిటీ చైర్మెన్ రేటినేని వెంకటయ్య, జిల్లా గ్రంథాలయ డైరెక్టర్ దుగ్యాల రవీందర్‌రావు, గ్రామపెద్దలు మారెళ్ళి యాకయ్య తోట సురేష్,పెద్ది శ్రీనివాస్, బరపటి శ్రీను, పాల్గొన్నారు.



మద్దిరాలలో...

తుంగతుర్తి: మండలకేంద్రంలో పాటు మండలపరిధిలోని అన్ని గ్రామాల్లో శోభకృత్ నామ తెలుగు సంవత్సరాది ఉగాది వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.అనంతరం తమ తమ ఇండ్లలో మామిడి ఆకులతో తోరణాలు కట్టారు.అనంతరం దేవాలయానికి కుటుంబసభ్యులతో కలిసి వెళ్లి ప్రత్యేకపూజలు నిర్వహించారు.షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడిని తయారుచేసి కుటుంబ సభ్యులందరూ సేవించారు.అనంతరం సాయంత్రం దేవాలయానికి వెళ్లి పురోహితుల చేత పంచాంగం చెప్పించారు.ఈ సంవత్సరం వర్షాలు బాగా కురిసి పంటలు పండాలని అందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని భగవంతుని కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలఅధ్యక్షుడు తాటికొండ సీతయ్య, ఆర్యవైశ్య సంఘం నాయకులు బండారు దయాకర్, ఓరుగంటి సత్యనారాయణ, వాసవిక్లబ్ మండల అధ్యక్షుడు బండారు వినయ్,భక్తులు పాల్గొన్నారు.



జాతీయస్థాయిలో భార్గవాచారికి పతకాలు

నవతెలంగాణ-హుజూర్‌నగర్

హుజూర్‌నగర్ పట్టణ పరిధిలోని మాధవరాయనిగూడెం గ్రామానికి చెందిన కన్నేకంటి నారాయణచారి కుమారుడు భార్గవాచారి ఈనెల 15, 16, 17 తేదీలలో రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్ సిటీలో జరిగిన జాతీయస్థాయి రెండవ స్మాష్ రాకెట్ టోర్నమెంట్‌లో ప్రతిభ కానాపరిచి సిల్వర్ మెడల్ బ్రౌన్ మెడల్ పథకాలు సాధించారు. ఈ సందర్భంగా భార్గవచారి మాట్లాడుతూ స్మాష్ రాకెట్ అసోసియేషన్ కార్యదర్శి పులి మధు, పేరెల్లి కోటయ్య ప్రోత్సాహమే ముఖ్య కారణమన్నారు. ఈ సందర్భంగా భార్గవాచారిని అభినందించారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేత

నవతెలంగాణ-ఆలేరురూరల్

ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మామిండ్ల స్రవంతి కుటుంబసభ్యులను టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బీర్ల ఐలయ్య బుధవారం పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ గంధమల్ల అశోక్, మండలఅధ్యక్షుడు వెంకటేశ్వరరాజు, గ్రామ శాఖ అధ్యక్షుడు విజేందర్‌రెడ్డి,ప్రధానకార్యదర్శి చాడరాజు, మైనార్టీ సెల్ అధ్యక్షులు ఇమ్రాన్‌ఖాన్,వార్డు సభ్యులు రాజశేఖర్,కరుణ, రాజు,నాయకులు జగతయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



పంటనష్టం పరిశీలన

నవతెలంగాణ-మోటకొండూర్

మండలంలోని కదిరేనిగూడెంలో అకాలవర్షాలకు నష్టపోయిన పంటలను బుధవారం ఏఈఓ రమేశ్, సర్పంచ్ వేముల పాండు పరిశీలించారు.గ్రామానికి చెందిన బెల్దే నరేందర్ రెండె కరాల వరి పంట నేల రాలిందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు వేముల విట్టల్, రైతులు పన్నాల మోహన్‌రెడ్డి, జెట్ట మహేందర్, జెట్ట శ్రీను పాల్గొన్నారు.





టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షులు రేవంత్‌రెడ్డికి సన్మానం

నవతెలంగాణ-ఆలేరురూరల్

ఆలేరు మండలం కొల్లూరు గ్రామానికి చెందిన టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి జనగాం ఉపేందర్‌రెడ్డి టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు అనుములరేవంత్‌రెడ్డిని బుధవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఉగాది శుభాకాంక్షలు తెలిపి శాలువాతా సన్మానించారు.ఆయన వెంట జిల్లా, మండలనాయకులు ఉన్నారు.

విషపూరితమైన కోనోకార్పరస్ చెట్లను తొలగించాలి

- కరోనా సోకిన వారికి ఆరోగ్య సమస్యలు

నవతెలంగాణ-ఆలేరుటౌన్

పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రజలకు మేలు చేసే మొక్కలు నాటించాల్సిన అధికారులు,ప్రజా ప్రతినిధులు ఆలేరు పురపాలక సంఘంలో హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారి మధ్యలో స్ట్రీట్ లైట్లని అనుకొని ప్రపంచవ్యాప్తంగా బ్యాన్ చేసిన, అది పట్టించుకోకుండా కోనో కార్పరస్ పట్టణంలో నాటగా , అవి వృక్షాలుగా మారుతున్నాయి.పురపాలక సంఘాలలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా అహ్లాదకరమైన వాతావరణం ఉండాలని ప్రజలకు మేలు చేసే మొక్కలు నాటాలని ప్రభుత్వం ఒకవైపు హరితహారం లో భాగంగా ఆదేశాలు జారీ చేస్తుంటే, ఆలేరు పట్టణంలో ప్రాణాంతకరమైన మొక్కలు నాటారు.మొక్కలు అతి తక్కువ కాలంలోనే వృక్షాలుగా మారుతాయి.వాటికి ట్రీ గార్డులు సైతం ఏర్పాటు చేశారు. ఇదే మొక్కలపై ప్రజల నుండి నిరసనలు వెల్లువెత్తడంతో జనగామ, సిద్దిపేట వంటి పట్టణాలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఇతర మున్సిపాలిటీలలో నాటారు.మున్సిపాలిటీలలోని అధికారులు స్పందించి వీటిని యుద్ధ ప్రాతిపదికన తొలగించారు. ఆలేరు పట్టణంలో మాత్రం దీని విరుద్ధంగా ఉందని ఎన్నిసార్లు ,పాలకుల అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ నిర్లక్ష్యం వహిస్తున్నారని , మనుషులకు పక్షులకు , ఇతర జీవరాసులకు ఈ మొక్కల నుండి వచ్చే గాలి వల్ల చనిపోయే ప్రమాదం ఉందని శాస్త్రవేత్తలు చెబుతున్నారని స్థానికులు వాపోతున్నారు. చెట్లు జీవకోటికి, మానవాళికి మేలు చేసే విధంగా ఉండాలని, విషపూరితమైన చెట్లను ఎలా పెట్టారని నిలదీస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు మాత్రం తమకు విషపూరితమైన మొక్కలని తెలియదని చెబుతున్నారు.విషపూరితమైన మొక్కలు నాటడంతో, ప్రజల ఆరోగ్యానికి నష్టం వాటిల్లే ప్రమాదం పొంచి ఉందని గుండె జబ్బులు వస్తాయని స్థానికులు చర్చించుకుంటున్నారు. నిషేధించిన చెట్లను ప్రజాధనం లక్షలక్షలు ఖర్చుపెట్టి ఆలేరు పట్టణంలో హరితహారం లో భాగంగా ఎందుకు నాటారని ప్రశ్నిస్తున్నారు. చెట్లు చూస్తే ఆకర్షణీయంగా అందంగా ఉన్నాయని, ఈ చెట్ల ద్వారా ఆక్సిజన్ వెలువడదని , శ్వాసకోస, గుండె సంబంధిత వ్యాధులు తలెత్తుతాయని,విషపూరితమైన చెట్లను వెంటనే తొలగించాలని పట్టణ ప్రజలు ప్రజా ప్రతినిధులను, అధికారులను కోరుతున్నారు. మనుషుల ఆయుష్షును పెంచే విధంగా ఉండే మొక్కలను నాటించాలని అధికారులని,ప్రజాప్రతినిధులని కోరుతున్నారు.



మనవాళికి మంచి చేసే మొక్కలు పెంచుతాం

పురపాలక సంఘంచైర్మెన్- వస్పరి శంకరయ్య

ఆలేరు పురపాలక సంఘంలో పట్టణంలోని జాతీయ రహదారిపై పెంచిన కోనోకార్పరస్ చెట్లను తొలగిస్తాం.ఈ చెట్లు తొందరగా పెరిగే అవకాశం ఉందని, విషపూరితమైన చెట్లని ముందుగా తెలియని కారణంగానే మొక్కలను నాటాల్సి వచ్చింది. జనగామ సిద్దిపేట జిల్లా కేంద్రాలలో వాటిని తొలగించారు. చెట్లపై ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చాం.విద్యుత్ శాఖ మంత్రి గుంటగండ్ల జగదీశ్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మహేందర్‌రెడ్డి మొక్కలను వెంటనే తొలగించాల్సిందిగా చెప్పారు.రెండు మూడు రోజులలో విషపూరితమైన చెట్లను తొలగించి వాటి స్థానంలో మానవాళికి మంచి చేసే మొక్కలు పెంచుతాం. పట్టణ ప్రజలు సహకరించాలి.





కురుమసంఘం ఆధ్వర్యంలో పచ్చడి పంపిణీ

నవతెలంగాణ-రాజపేట

శోభకృత నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని మండలపరిధిలోని పారుపల్లి గ్రామంలో కురుమ సంఘం ఆధ్వర్యంలో బీరప్పదేవుని సన్నిధిలో ఉగాది పచ్చడి పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు, గ్రామ పెద్దకురుమ జూకంటి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ శోభాకృత నామ సంవత్సరంలో గ్రామప్రజలంతా సుఖ సంతోషాలతో, ఆర్థిక పరిపుష్టతో, సమస్త రంగాల్లో అభివృద్ధి చెంది గ్రామ అభివృద్ధికి పాటుపడాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పెద్దకురుమ రావుల బాలరాజు, నాయకులు చీర మహిపాల్, జూకంటి వీరయ్య, కాలె నర్సింహులు, జూకంటి కొమురయ్య, కాలే విజయ్, పుప్పాలయాదయ్య, జూకంటి జానకిరాములు, కడారు బాలయ్య, రావులగోపాల్, బుర్రి సిద్దులు, పర్వతాలు, జూకంటి రాజు, రావుల ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉగాది శుభాకాంక్షలు తెలిపిన పలువురు ప్రముఖులు



నవతెలంగాణ-ఆలేరుటౌన్

మండలకేంద్రంలో బుధవారం శోభాకృత నామ ఉగాది పర్వదిన వేడుకలు పట్టణ ప్రజలు భక్తిశ్రద్ధల నడుమ ప్రకృతిని కొలుస్తూ వేడుకలు నిర్వహించారు.ఉదయాన్నే ఇండ్లను శుభ్రపరుచుకుని,వాకిళ్లలో ఉగాది ముగ్గులు వేశారు.మామిడితోరణాలు,వేపకొమ్మలతో ముఖద్వారాలను అలంకరించారు.శ్రీ కనకదుర్గ ఆలయం, శివాలయం, శ్రీ గోదాదేవి లక్ష్మీదేవి సరిత రంగనాయక ఆలయం, చాముండేశ్వరాలయాలలో భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. చేదు, పులుపు, తీపి, వగరు, కలగలిపిన వేప ఆకులు, పండు, బెల్లం పానకం కొబ్బరి కలగలిపి పచ్చడి తయారు చేసి ప్రజలకు పంచారు.ఆలయఅర్చకులు ఆలేటి రంగన్న పంతులు, వేదాటి సత్యనారాయణ శాస్త్రి, మంగళగిరి శేషగిరి, మంగళగిరి వరదరాజులు భక్తులకు పంచాంగ శ్రవణం చదివి వినిపించారు.ద్వారకనగర్‌లో భజరంగ్ యూత్ ఆధ్వర్యంలో శుభాకృత నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలుపుతూ భజరంగ్ యూత్ సభ్యులు ఉగాది పచ్చడిని తయారుచేసి కాలనీవాసులకు పంచారు. శోభాకృత నామ ఉగాది నూతన సంవత్సరం సందర్భాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వ విప్ గొంగిడిసునీత, ఉమ్మడి నల్లగొండ జిల్లాడీసీసీబీ చైర్మెన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, మాజీ శాసనసభ్యులు డాక్టర్ కుడుదుల నగేష్,బూడిద భిక్షమయ్యగౌడ్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీర్ల ఐలయ్య, ఆలేరు పురపాలక సంఘం చైర్మెన్ వస్పరి శంకరయ్య ,మాజీ జెడ్పీటీసీ బొట్ల పరమేశ్వర్ ప్రజలకు శుభాకాంక్షలుత ఎలిపారు.ఈ కార్యక్రమంలో పట్టణ ప్రజలు, యువతీ యువకులు పాల్గొన్నారు.



కిరణ్ ముగబాసవ్‌ను కలిసిన జెడ్పీటీసీ

నవతెలంగాణ-ఆలేరురూరల్

రాజీవ్‌గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ తెలంగాణ రాష్ట్ర చైర్మెన్ రాచమల్ల సిద్దేశ్వర్ ఆధ్వర్యంలో గాంధీభవన్ వేదికగా జరిగిన టాలెంట్ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఆర్‌జీపీఆర్ఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కిరణ్ ముగబాసవ్‌ను ఆలేరు జెడ్పీటీసీ కుడుదుల నగేశ్, టీపీసీసీ ఉపాధ్యక్షులు చామల కిరణ్‌కుమార్ బుధవారం వారి చాంబర్‌లో కలిసి రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి రావడానికి ఏ విధంగా కృషి చేయ్యాలన్న విషయంపై మాట్లాడారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు, మండలనాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ధర్నా

నవతెలంగాణ-వలిగొండ రూరల్

మండలపరిధిలోని టేకులసోమారం గ్రామంలో మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం కాగా బుధవారం అఖిల పక్షాల ఆధ్వర్యంలో రోడ్డు బైఠాయించి ధర్నా, రాస్తారోకో నిర్వహించారు.ఈ సదర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లకు రంగులు వేయాలని, రోడ్డు మధ్యలో డివైడింగ్ లైన్స్, జీబ్రా క్రాసింగ్ లైన్స్ వేయాలని కోరారు.మూలమలుపుల వద్ద సూచికబోర్డులు ఏర్పాటు చేయాలని, పెరిగిన రద్దీ దృష్ట్యా వెంటనే రెండులైన్ల రోడ్డును నాలుగు లైన్ల రహదారిగా మార్చాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు యాదయ్య, లింగస్వామి, శంకర్, అజయ్, పరమేష్, స్వామి, మదరాజు, పాక వెంకటేష్,నారగోని రాజు, ఫయాజ్‌బాబా, గణేష్, బాలు,మురళీ, శశాంక్, వినయ్, ఉదయ్, భరత్ తదితరులు పాల్గొన్నారు.



క్యూన్యూస్ ఆఫీస్‌పై దాడిని ఖండించిన బీర్ల అయిలయ్య

నవతెలంగాణ-ఆలేరురూరల్

క్యూ న్యూస్ ఆఫీస్‌పై జరిగిన దాడిని టీపీసీసీ ప్రధానకార్యదర్శి బీర్ల అయిలయ్య బుధవారం ఒక ప్రకటనలో ఖండించారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రశ్నించేగొంతులను అణిచివేయాలని చూస్తుందన్నారు.ప్రజల కోసం మాట్లాడుతున్న తీన్మార్ మల్లన్న క్యూన్యూస్ ఆఫీస్‌పైన దాడి చేయడం బాధాకరమన్నారు.ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉండి ప్రజల కోసం మాట్లాడుతుంటే క్యూన్యూస్‌పైన గూండాలతో దాడి చేయడం ఏంటని ప్రశ్నించారు.వెంటనే పోలీసులు దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.






కల్వర్టు నిర్మాణపనులు ప్రారంభం

నవతెలంగాణ-ఆలేరురూరల్

మండలంలోని మంతపురి గ్రామం నుండి నల్లపోచమ్మ గుడికి వెళ్లే దారిలోని వాగుపై రైతుల అభ్యర్ధన మేరకు గుడికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం కల్వర్టు నిర్మాణ కోసం నిధులు మంజూరు కావడంతో మాజీ ఎమ్మెల్యే,జెడ్పీటీసీ కుడుదుల నగేష్ కల్వర్టు నిర్మాణపనులు బుధవారం ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ పారుపల్లి లావణ్య నరసింహులు, మాజీ సర్పంచ్ ఎల్లయ్య ,శంకర్, బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షులురాములు, మండల కోఆప్షన్ సభ్యులుగౌస్,ఆలేరు నియోజకవర్గ ఉపాధ్యక్షులు సంతోష్,గ్రామస్తులు మధుసూదన్‌రెడ్డి,బాలయ్య,సిద్ధులు, చంద్రశేఖర్,స్వామి, సంతోష్,బాలరాజు, రాములు, సత్తయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



వికలాంగులు ఉచిత బస్‌పాసులు సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-భూదాన్‌పోచంపల్లి

వికలాంగులు ఉచిత బస్‌పాసులను సద్వినియోగం చేసుకోవాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఎన్‌పీఆర్డీ జిల్లా ప్రధాన కార్యదర్శి వనం ఉపేందర్ కోరారు.బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. వికలాంగుల హక్కుల జాతీయ వేదిక పోచంపల్లి మండల ఎన్‌పీఆర్డీ సదస్సు శుక్రవారం ఉదయం 11 గంటలకు పోచంపల్లి మండల మార్కండేయ గుడి పక్కన గ్రౌండ్‌స్టేజ్‌లో జరుగుతుందన్నారు.అనంతరం మండలనూతన కమిటీ ఎన్నిక ఉంటుందన్నారు.డిపోమేనేజర్ బస్‌పాసులను పంపిణీ చేస్తారన్నారు.ఈ కార్యక్రమంలో మండల నాయకులు చుక్క నరేష్,ఆనంద్,భిక్షపతి, బొమ్మ శేఖర్, కాసుల మల్లేశ్, శ్రీనివాస్‌స్వామి, మధు, బస్‌పాస్ ఇన్‌చార్జి వెంకటేశం పాల్గొన్నారు.

భగత్‌సింగ్ వర్థంతిని విజయవంతం చేయండి

నవతెలంగాణ-ఆలేరుటౌన్

మండలకేంద్రంలో గురువారం నిర్వహించనున్న భగత్‌సింగ్ వర్థంతిని విజయవంతం చేయాలని డీవైఎఫ్‌ఐ పట్టణ కార్యదర్శి భువనగిరి గణేష్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి ఎంఏ ఇక్బాల్‌తో కలిసి గురువారం నిర్వహించే కాగడాల ప్రదర్శన కోసం ఏర్పాట్లు చేశారు.కాగడాల ప్రదర్శన కు డీవైఎఫ్‌ఐ, సీపీఐ(ఎం),ఎస్ఎఫ్‌ఐ సభ్యులంతా హాజరై విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో చిన్న రాజేష్, కందుల నాగరాజ్, కాసుల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా బోనాలు

నవతెలంగాణ-ఆలేరుటౌన్

మండలకేంద్రంలో బుధవారం కురుమ సంఘంపట్టణ కమిటీత ఆధ్వర్యంలో పట్టణంలోని పెద్ద కురుమ ఇంటి వద్ద నుండి బీరప్ప గుడి దగ్గరకి డప్పు చప్పులు , సన్నాయి వాయిద్యాల తో బోనాలు తీసుకెళ్లి బీరప్ప, అక్క మహంకాళి మాతాలకు నైవేద్యం సమర్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉగాది పచ్చడి పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కురుమ సంఘం అధ్యక్షులు ఎగిడి లక్ష్మణ్, ఎగిడి శ్రీశైలం, ఎగిడి మల్లయ్య, దయ్యాల సంపత్, నంద ఐలయ్య ,కుల పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

